# జేబు

"నాకు కొత్త పరికిణీ, జాకట్టూ కావాలి" అంది పరిమళ అమ్మతో.

"వారంరోజులు కూడా కాలేదు కొత్తస్కూలంటూ కొత్తబట్టలు కుట్టించి. మళ్లీ ఇప్పుడే ఏమిటి?" అంది అమ్మ.

"పోనీ పరికిణీ అక్కర్లేదు. జాకట్టు కుట్టించు. కొత్తది కుట్టించకపోతే నేను స్కూలికి వెళ్లను" అంది పరిమళ.

"బాగుంది వరస. రోజుకో కొత్త జత కావాలేమిటి రాణీగారికి" అంది అమ్మ నవ్వుతూనే.

"రోజుకోటి అక్కర్లేదు. నాకు ఇంగ్లీషు క్లాసు వున్నరోజున వేరే జాకట్టు కావాలి," అంది పరిమళ. "ఏమయింది ఇంగ్లీషు క్లాసులో?" అనడిగింది అక్కయ్య. ఇలాటికోరికలకి మూలం స్కూలేనని అక్కయ్య గ్రహించేసింది. పరిమళ మాటాడలేదు.

అమ్మ "సరేలే చూద్దాం. పైనెల బాబి పుట్టినరోజు వస్తోంది కదా. అప్పుడు నీక్కూడా కుట్టిస్తాలే" అంది.

"అలా కాదు. నాకు ఇప్పుడే కావాలి" అంది పరిమళ మళ్లీ.

"బాగానేవుంది వరస. లేడికి లేచిందే ప్రయాణం అని, కో అనేసరికి కొనీడానికి ఎలా అవుతుంది. ఏవిటాతొందర" అంటూ కసురుకుంది అమ్మ. పరిమళ ఊరుకుంది కానీ మనసులో ఉక్రోషం పట్టలేకుండా వుంది.

ముందు రోజు ... స్కూళ్లు తెరిచారు. పదోక్లాసులో అడుగు పెట్టింది పరిమళ. కొత్త పరికిణీ జాకట్టుతో, పుస్తకాలూ, జామెట్రీ బాక్సూ గుండెల్లో పొదివి పట్టుకుని. అన్నీ కొత్తమొహాలు. క్లాసులో అడుగుపెడుతుంటే గుండెలు చుక్ చుక్ మంటూ చిన్ని రైలింజనులా కొట్టుకున్నాయి.

కొత్తస్కూలు. ఊరిపెద్దగారు దానం చేసిన గొడ్లపాకలో పెట్టారు. పిల్లలు కూర్చోడానికి నాలుగు నాపరాయి పలకలు నల్లరాయి బండలమీద అమర్చేరు. పరిమళకి అలాటి స్కూలు చూడడం అదే మొదలు. కొత్తమొహాలూ, కొత్త క్లాసు, కొత్త మేష్టరు, కొత్తపుస్తకాలు, కొత్త పరికిణీ, కొత్త జాకట్టు ...అమ్మ వారంరోజులకిందట తనని బజారుకి తీసికెళ్లి, తనే ఎంచుకున్న పువ్వుల పరికిణీగుడ్డా, మామిడిచిగురురంగు జాకట్టుగుడ్డా కొని, అక్కడే అరుగుమీద కుట్టుమిషను పెట్టుకుని కూర్చున్న అమీరుసాయబుచేత కుట్టించిన కొత్త పరికిణీ, జాకట్టూ – సమస్తం

చక్కగా అమిరేయి.

అయినా కొత్తక్లాసు కొత్తక్లాసే. అడుగులో అడుగేసుకుంటూ, తల ఓరగా వంచుకుని దొంగతనం చేయబోతున్నట్టు చుట్టూ చూస్తూ క్లాసులో అడుగు పెట్టింది. మేష్టారు ఇంకా రాలేదు. ఏడుగురు మగపిల్లలు కుడిపక్క వరసల్లోనూ, ఐదుగురు ఆడపిల్లలు ఎడమపక్క రాతిపలకలమీదా సర్దుకుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

పరిమళ కళ్లు నెమ్మదిగా పాక నలుమూలలా ఓ చుట్టు చుట్టి, ఎడమవేపు రెండోవరసలో కూర్చున్న ఇద్దరు అమ్మాయిలమీద వాలేయి. ఎందుకో వారిద్దరూ ప్రత్యేకంగా కనిపించారు. వాళ్లమీద ఆపిల్లకళ్లు అట్టే నిలిచిపోయేయి. అందులో అటువేపు వున్న అమ్మాయి తనని గమనించి మెల్లిగా నవ్వి, పక్కనున్న అమ్మాయికి చెప్పినట్టుంది. రెండో అమ్మాయి వెనుదిరిగి తనవేపు చూసింది. "యుగాలసేపు" అనిపించినతరవాత, మెల్లిగా వాళ్లవేపు నడిచింది. వాళ్లు కూడా రమ్మన్నట్టు జరిగి చోటిచ్చారు తనకి.

"నీపేరేమిటి" అని అడిగింది జరిగి చోటిచ్చిన అమ్మాయి. తెల్లగా, పల్చగా వుంది, కోలమొహం, గట్టిగా పట్టుకుంటే కందిపోతుందేమో అనిపించేంత సుకుమారం. ఆఅమ్మాయిపేరు రమణిట. రెండో అమ్మాయి చామనచాయ, నిన్నెక్కడో చూసేనంటూ పలకరించే కళ్లూ, పెదవులమీద చిరునవ్వు అక్కడే పుట్టిందేమో అనిపిస్తుంది. విశాలట ఆపిల్ల పేరు.

"పరిమళ" అంది మందరస్థాయిలో, రహస్యం చెబుతున్నట్టు.

అటువేపు కూచున్న అబ్బాయిల్లో ఒకడు "మాష్టారు" అన్నాడు తనపక్కవాడితో.

రమణితో మాటాడుతున్న పరిమళ ఇటు తిరిగి, ప్రవేశిస్తున్న మాష్టారిని చూసి, నోరు తెరుచుకు వుండిపోయింది. గుండె ధన్ ధన్ మని రెట్టింపు వేగంతో కొట్టుకుంటోంది. ఆయన వాళ్ల ఇంటాయన! నెలరోజులవుతోంది పరిమళా వాళ్లూ ఆయింట్లో అద్దెకి దిగి. వచ్చిందగ్గరునుంచీ ఆయన అమ్మతో ఒకటే గొడవ, గుమ్మంముందు ముగ్గు వెయ్యడానికి వీల్లేదూ, రాత్రి ఎనిమిది తరవాత రేడియో పెట్టడానికి వీల్లేదూ, శాస్త్రీయసంగీతమే పెట్టాలీ, కొళాయినీళ్లు తమనే ముందు పట్టుకోనివ్వాలీ .. అంటూ. అందులో రేడియో పెట్టడంలాటివి తనకి పరోక్షంగా తగులుతున్నాయి.

ఆయన కుర్చీదగ్గరికి వెళ్లి, చుట్టూ ఓమారు చూసి, "హు ఓ కొత్తమ్మాయి వచ్చిందన్నమాట" అన్నారు తనవేపు చూస్తూ. తరవాత ఎటెండెన్స్ తీసుకుంటూ తనపేరు వచ్చేసరికి తలెత్తి తనవేపే చూస్తూ "ప్రమీల" అన్నారు.

"ప్రమీల కాదండీ, పరిమళ" అంది కాస్త బెదురుగా.

"పరిమళ" అన్నారు మేష్టారు తినేస్తున్నట్టు చూస్తూ.

క్లాసులో చిన్న నవ్వులు వినిపించేయి. సైలెన్స్ అంటూ అరిచేరు మేష్టారు. ఇంగ్లీషు

క్లాసు. నాన్‌డిటైల్డ్ టెక్స్టుబుక్కు - పంచపాండవులూ ద్రోణాచార్యుడిదగ్గర విలువిద్య నేర్చుకోడం, అర్జునుడు చెట్టుమీద పిట్టకన్ను తప్ప మరేమీ కనిపించడంలేదనడం, ఆచార్యులవారు Concentration&hx&exarrauనీని అంటే అదీ అని వివరించడం ?

పుస్తకంలోకి తలదూర్చేసిన పరిమళకి కుడిబుజం వెనకవేపుకి ఓ చిన్న కాగితంబాణం వచ్చి తగిలింది.

పరిమళ వులిక్కిపడింది. ఒళ్లో వున్న జామెట్రీబాక్స్ డబ్ మంటూ కింద పడింది. ఇంగ్లీషు మేష్టారికి తెగ కోపం వచ్చేసింది.

ఎవరది అని ఆయన అడక్కుండానే తెలుస్తోంది. పరిమళ వంగి చెల్లాచెదరుగ పడిన స్కేలూ, కాంపసూ, పెన్సిలూ, రబ్బరూ,.. ఒక్కటొక్కటే ఏరుకుంటోంది ఆయనవేపు బెదురుగా చూస్తూ. క్లాసులో అబ్బాయిలు కిస్‌కిస్‌మంటూ నవ్వేరు.

సైలెన్స్ అంటూ మేష్టారు అరిచి, పరిమళని ఇలా రా అని తన కుర్చీదగ్గరికి పిలిచారు.

పరిమళ జామెట్రీ బాక్సూ, అందులో వుండవలసిన సామానూ అంతా బల్లమీద పెట్టి ఆయనదగ్గరికి వెళ్లింది.

"ఆ పోవులడబ్బా నాక్లాసుకి ఎందుకు తెచ్చేవు?" అని అరిచేరాయన, కొట్టడమే తరువాయిగా. పరిమళ జవాబు చెప్పలేదు.

"ఆచెత్తడబ్బా ఇంగ్లీషుక్లాసులో కావాలా?" అని మళ్లీ రొకాయించేరు.

"అక్కరలేదు సార్" అంది పరిమళ బెదురుగా.

"రేపటినించీ నాక్లాసుకి జామెట్రీబాక్స్ తీసుకురాకు, అందరికీ చెప్తున్నా, నాక్లాసుకి ఎవరూ జామెట్రీబాక్సు తీసుకు రావడానికి వీల్లేదు" అంటూ క్లాసు మొత్తానికి తాఖీదిచ్చేరు ఆయన. క్లాసులో పన్నెండు జతలకళ్లు తనవేపు తిరిగేయి "ఇదంతా నీనించే" అంటూ. ఆరోజుకి క్లాసు అయిపోయింది. తనకి జాగా ఇచ్చిన స్నేహితురాళ్లిద్దరూ, రమణీ, విశాలా మాటాడుకుంటూ బయటికి వచ్చేరు. వాళ్ల ఇళ్లు ఇరుగూ పొరుగూన్న. తనఇంటికి దారి అటువేపే. అంచేత వాళ్లతో నడుస్తూ, వచ్చి, వాళ్లఇళ్లు దాటింతరవాత తన ఇంటివేపు దారి తీసింది.

ఇహమీదట ఇంగ్లీషుక్లాసుకి జామెట్రీబాక్స్ తీసుకెళ్లరాదు. మరి పెన్సిలూ, రబ్బరూ, పెన్సిలు చెక్కుకునే మరా ఇవన్నీ ఎలా ? చేత్తో పట్టుక్కూచోలేదు కదా. మధ్యాన్నం చూసింది అటుపక్క కూచున్న బక్కరాజు మహ షోగ్గా జేబులోంచి పచ్చమర తీసి పెన్సిలు చెక్కుకోడం. వాడికేం, ఒకటి కాదు మూడు జేబులున్నాయి నిక్కరుకి రెండూ, చొక్కాకి ఎడంవేపు గుండెకానుకుని ఓజేబు. ఆజేబుమీద సిరామరక. హీహీహీ? "ఎందుకే నవ్వుతున్నావూ?" అంది రమణి.

"ఇందాకా తెల్లచొక్కా రాజుగాడి జేబు ? హీహీ .. నువ్వు చూసేవా ? పూవుమీద పురుగులా? " అంది ఇంకా నవ్వుతూనే.

"ఏమో నేను చూడలేదు. నువ్వు చూసేవుటే" అని అడిగింది విశాలని. విశాల కూడా చూడలేదు. వాళ్లకి నవ్వు కూడా రాలేదు. ఏంవుంది అందులో నవ్వడానికి?

అంత స్పష్టంగా కొట్టొచ్చినట్టు కనిపిస్తున్న తెల్లచొక్కా చొక్కాకున్న జేబూ, జేబుమీద మరకా వీళ్లెలా చూడలేదో పరిమళకి అర్థం కాలేదు. వాళ్లు చూసి వుంటే మరి వాళ్లకి నవ్వొచ్చేదా అన్నది కూడా తెలీలేదు. ఫ్చ్ కొందరంతే కాబోలు?

చంద్రుడిమీద కుందేలుపిల్లలాటి సిరామరక తలుచుకుంటే తనకి నవ్వొచ్చింది. మంచిపని అయింది అబ్బాయిగారికి అని కూడా అనిపించింది. కానీ ? బాగా ఆలోచించినతరవాత చొక్కాకి జేబు వుంటే కలిగే లాభాలే ఎక్కువ కనిపించేయి. నవ్వు పోయి, మొహం సీరియస్సయిపోయింది.

"మేష్టారికి నువ్వంటే కోపం. అనవసరంగా నీమీద కేకలేసేరు" అంది రమణి.

"నేనంటే ఆయనకెందుకూ కోపం?" అంది పరిమళ.

"ఏమో మరి. వాళ్లింట్లో అద్దెకి వున్నారు కదా. మరేదో అయివుంటుంది." పరిమళ అప్పుడే ఓనిర్ణయానికి వచ్చేసింది. తను మాట పడదు. మళ్లీ ఇంగ్లీషు క్లాసుకి తను జామెట్రీ బాక్స్ పట్టుకురాదు. మరి పెన్సిలూ, అది చెక్కుకోడానికి మరా, రబ్బరూ, ఎలా?

"లేడికి లేచిందే ప్రయాణమా" అంటూ కసిరిన అమ్మ "పోన్లెద్దూ ఓపని అయిపోయినా అయిపోయినట్టే" అనుకుంది తెల్లారి లేచేక. ఎలాగా బాబీకి కొనాలి కదా. పైగా ఆకుట్టుపనివాడు అన్నరోజుకి ఇస్తాడో ఇవ్వడో. ఇప్పుడే మొదలెడితే నయం అని ఆ సాయంత్రమే తమ్ముడితోపాటు రామయ్యసెట్టి కొట్టుకి తీసికెళ్లింది బట్టలు కొనడానికి. బాబిగాడికి చొక్కా గుడ్డ ఎంపిక ఇట్టే అయిపోయింది కానీ పరిమళకి నచ్చిన రంగూ, పువ్వులూ, అంచూ కుదేసరికి పొద్దు వాలింది.

అమ్మ వాటికి ధర చెల్లించి, అరుగుమీదున్న అమీరుసాయిబుకిచ్చింది కుట్టడానికి.
సాయిబు కొలతలు తీసుకున్నాడు.

"నాజాకట్టుకి జేబు పెట్టు" అంది పరిమళ. సాయిబు అమ్మవేపు చూశాడు.

"జాకట్టుకి జేబూ ఏమిటే?" అంది అమ్మ.

"బాబీచొక్కాకి పెట్టేడు కదా. నాకూ అలాగే పెట్టమను" అంది పరిమళ అదేమీ వింత కానట్టు.

"వాడంటే మగవాడు" అంది అమ్మ.

"వాడు మగవాడయితే, నేను ఆడవాడు. నాజాకట్టుకి జేబు వుండాలి. లేకపోతే నాకు జాకట్టే అక్కర్లేదు."

"ఆడవాడు ఏమిటే?" అంది అమ్మ నవ్వుతూ.

"జాకట్టుకి జేబు బాగుండదు అమ్మాయిగారూ" అన్నాడు సాయిబు.

"నాకు బాగుంటుంది" అంది పరిమళ ఒత్తి పలుకుతూ.

"పోనిద్దూ. సరదా పడుతోంది. ఓ చిన్న గుడ్డముక్క అతికిద్దూ" అంది అమ్మ. ఇదేదో తెమిల్తే కానీ ఇంటికెళ్లి వంట మొదలెట్టడం జరగదు. ఏడు కొట్టేసరికి కంచంముందు కూచోపోతే సోష వచ్చేస్తుంది ఆయనగారికి..

జేబు పెట్టడానికి ఒప్పందం అయింపోయింతరవాత ఎక్కడ అన్న ప్రశ్న వచ్చింది. అబ్బాయిలచొక్కాల్లా ఎడంవేపు గుండెదగ్గరా? నాన్నగారికమీజుకి లాగ పక్కజేబా ? "పక్కకి పెడతానులెండి, కనపడకుండా" అన్నాడు సాయిబు.

పరిమళ, "పక్కకి కాదు. ఎడంవేపు కిందంచు దగ్గర పెట్టు. కుడిచేత్తో రాసుకుంటున్నప్పుడు రబ్బరు అందుకోడానికి అనువుగా" అంది పరిమళ. ఆపిల్ల ఎప్పుడూ ఏవిషయంలోనూ ఏదో ఒకటిలెద్దూ అంటూ సర్దుకుపోడానికి ఒప్పుకోదు. ఏం చేసినా, అవసరం అయితేనే, ఆతరవాత ఆ అవుసరానికి అనువుగానూ.

మొత్తమ్మీద పరిమళ జాకట్టుకి చిన్నజేబు జాకట్టు చిగుళ్ల ఎడంవేపు పెట్టడానికి నిశ్చయం అయేసరికి ఆరుంబావు అయింది. అమ్మ తొందరపడుతూ పిల్లలిద్దరినీ రిక్షా ఎక్కించి ఇల్లు చేరింది ఆరాటపడిపోతూ. మర్నాడు తెలుగు గ్రామరుక్లాసు. పరిమళకి ఇంగ్లీషు మేష్టరంటే ఎంత భయమో తెలుగుమాష్టారంటే అంత ఇష్టం. ఆయన చెప్పే పద్యాలూ, గ్రామరూ, అన్నీ ఎంతో చక్కగా అర్థం అవుతాయి తనకి. పాణిని కథ చెప్తున్నారు.

పరిపూర్ణ చంద్రబింబమువోలె శాంతమై కళకళలాడు మొగంబు వాడు

ఆజానుబాహుండు, యున్నతోరస్కుండయి చూడంగ తగు మేని సొబగువాడు ఆసాయమాయాసమనక గురవరపదాబ్జశుశ్రూష నెరపువాడుఁ

గాని అది ఏమి పాపమో గడగి యొక్క పారమయిన అప్పగించిన పాపమున బోఁడు.

పరిమళకి ఈపద్యం చాలా ఇష్టం. చివరిపాదంలో చమత్కారం ఆపిల్ల మనసునాకట్టుకుంది. పద్యంలో పదే పదే "వాడు" అని రావడంతో నిన్నట్నుంచీ తనని వేధిస్తున్న ప్రశ్నకి సమాధానం కనుక్కోవాలి అనిపించింది. క్లాసు అయిపోయిన తరవాత మేష్టారిదగ్గరికి వచ్చింది "నాకో సందేహం మాష్టారూ" అంటూ.

"ఏమిటమ్మా?" అన్నారాయన చిరునవ్వుతో. ఆయనకి కూడా పరిమళ అంటే ప్రత్యేకాభిమానం చాలా తెలివైనదని.

"అదేనండీ. వాడు ఏకవచనం, వారు బహువచనం కదండీ."

"అవునమ్మా"

"మగవాడు ఏకవచనం, మగవారు బహువచనం. మరి ఆడవారు బహువచనం కదా, ఆడవాడు ఏకవచనం ఎందుకు కాదూ?" మాష్టారు నవ్వేరు.

పరిమళ నవ్వలేదు. ఆపిల్లకి నిజంగానే ఆసందేహం వచ్చింది. తనకి సమాధానం కావాలి, అంతే.

"వ్యాకరణం ఏది ఎందుకు ఎలా లేదో చెప్పదమ్మా. వున్నమాటలు కాలగతిలో ఎలా రూపాంతరం పొందేయో చెప్తుతుంది అంతే. నువ్వు ఆడవాడు అంటే, మరో పదిమంది అలాగే అంటే అదే కరెక్టయిపోతుంది కొంతకాలానికి. నువ్వు గొప్ప రచయిత్రివి అయింతరవాత చెయ్యి ఆపని." అన్నారాయన సగం హాస్యంగానూ, సగం నిజంగానూ.

"నేనిప్పుడే అంటానండీ," అంది పరిమళ. ఆపిల్లకి ఆయనదగ్గర అంత చనువుంది మరి.

"లేదులే. నువ్వు పెద్దరచయిత్రివి అయేవరకూ ఆగాలి. అప్పుడయితే నీమాట చెల్లుతుంది. ఆర్షప్రయోగం అని అందరూ మెచ్చుకుంటారు. ఇప్పుడంటే, నీకు భాష రాదంటారు. ఇంతకీ ఈవాదన ఎందుకు వచ్చిందసలు?" అన్నారు మేష్టారు.

పక్కనే వున్న రమణి "ఇదుగో, ఈ జాకట్టుజేబుతో వచ్చిందండీ", అంది నవ్వుతూ, ఆజేబు ఆయనకి కనిపించేలా రవంత లాగి.

"ఏమిటీ ...నేనెప్పుడూ జాకట్టుకి జేబు చూడలేదులే .. అందుకన్నాను," ఆయన పరిమళ మొహంలోకి చూస్తూ.

"అదేనండీ మన పరిమళ అంటే." అంది వెనకనున్న విశాల.

రాత్రంతా ఆలోచిస్తూనే వుంది పరిమళ. జేబుకి ఆడా మగా ఏమిటి అని. చాలా చాలా ఏళ్లకి ముందు, అమ్మా, అమ్మమ్మా బయటికి వెళ్లని రోజుల్లో వాళ్లకి, ఇలా పెన్సిళ్లూ, రబ్బరు ముక్కలూ పట్టుకుతిరగాల్సిన అవుసరం లేని రోజుల్లో జేబులు అక్కర్లేకపోయి వుండొచ్చు. ఇప్పుడు తను అవన్నీ పట్టుకు తిరగాలంటే, మహ చిరాగ్గా వుంటోంది. పొద్దస్తమానం ఏదో ఒకటి చేతిలోంచి జారి పడిపోవడం, మళ్లీ కొత్తది కావాలని ఇంట్లో గొడవాను.

"పోనీ చిన్నసంచీ కుట్టిస్తా, అందులో పెట్టుకో" అంది అక్కయ్య. కానీ ఆసంచీ కూడా పారేసుకోకుండా చూసుకోవాలి కదా అస్తమానం. అదీ ఓ పనే? జేబులో అయితే అవన్నీ ఓచోట పడుంటాయి. తాను అనుక్షణం చూసుకోనక్కర్లేదు పెన్సిలుందా, రబ్బరుందా? అనుకుంటూ. అప్పుడు తన తలకాయని వేరే విషయాలకి వినియోగించుకోవచ్చు కదా అనుకుంటూ నిద్ర పోయింది.

పదిహేనేళ్లయింది. అమెరికాలో స్థిరపడిన పరిమళ, ఇండియా వచ్చి, రమణిని చూడ్డానికి వాళ్లింటికొచ్చింది.

రమణి ఉప్పొంగిపోతూ, "అబ్బ, ఎన్నాళ్లకెన్నాళ్లకి కనిపించేవే. నిన్ను మళ్లీ చూస్తాననుకోలేదు. ఎప్పుడో ఏడాదికో రెండేళ్లకో నీకథలు పత్రికలలో కనిపించినప్పుడల్లా నేనూ విశాలా నీగురించే అనుకుంటాం."

పరిమళ కూడా సంతోషంగా వుంది తనకథ చదివి, తనని తలుచుకునేవారు వున్నారని తెలిసి.

రమణి, "పద, పద, విశాల హైదరాబాదులో వుంటుంది కానీ వాళ్లక్కయ్యని చూడ్డానికొచ్చిందిట నిన్ననే. పద, వాళ్లింటికెళ్దాం" అంటూ హడావుడి చేసి లాక్కుపోయింది వాళ్లింటికి. విశాల ఇంట్లో ముగ్గురూ కూచుని పొట్టాచారిగారి గురించీ, లెక్కలమాష్టారు గురించీ, ఇంకా ఎన్నో విషయాలు గలగల మాటాడేసుకున్నారు. "ఆరోజుల్లో నువ్వొక్కదానివే జేబు జాకట్టుతో క్లాసు కొచ్చేదానివి. మేం ఇద్దరం నవ్వుకునేవాళ్లం నీ వుపాయాలకి" అంది రమణి. పరిమళ కూడా నవ్వేసి, "మీరెందుకు పెట్టించుకోలేదూ మీజాకట్లకి పోకెట్లు?" అంది.

"ఎక్కడ ? మాఅక్కయ్యకి చిన్నవి అయిపోయినబట్టలన్నీ సద్వినియోగం చెయ్యడంతోనే సరిపోయింది నాకు" అంది విశాల.

"నాకు ఆ అదృష్టం కూడా లేదు. నాకు వున్నవాడొక్కడూ అన్నయ్య అయిపోయేడు. వాడి చొక్కాలు నన్ను తొడుక్కోనిచ్చినా బాగుండేది. జేబులు అవే వచ్చేసి వుండేవి, ప్చ్, తోచలేదు కానీ" అంది రమణి.

"మన తెలుగు మేష్టారు ఎక్కడున్నారు?" అనడిగింది పరిమళ.

"రిటైరయిపోయారు. ఆ ఇంట్లోనే వున్నారు."

"వెళ్లి చూద్దామా?" అంది పరిమళ చిన్నప్పటి ప్రసంగాలు లీలగా మనసులో మెదిలి.

"పదండయితే తొరగా. ఇప్పుడయితే ఆయన ఇంట్లోనే వుంటారు. మరో గంట పోతే దొరకరు. వాకింగుకి వెళ్లిపోతారు." అంది విశాల. ముగ్గురూ కలిసి మేష్టారింటికి వచ్చేరు. ఆయన వరండాలో కూర్చున్నారు భాగవతం చదువుకుంటూ. పక్కనే స్థంభాన్నానుకుని కూర్చుని, రాత్రికూరకి చిక్కుడుకాయలు ఈనెలు తీస్తున్నారు ఆయనభార్య కామమ్మగారు. గేటు తోసుకుని వస్తున్న ముగ్గురు ఆడవాళ్లని చూసి, మేష్టారు చత్వారం కళ్లద్దాలు సవరించుకుంటూ ఎవరూ అన్నారు.

కామమ్మగారు గుర్తు పట్టి, "అదేనండీ, మన రమణీ, విశాలా, పరిమళాను" అని, రండమ్మా అంటూ వాళ్లని ఆహ్వానించింది ఆప్యాయంగా. వాళ్లు మేష్టారికి నమస్కారాలు చేసి, ఆపక్కనే చాపమీద కూర్చున్నారు.

"జేబుజాకట్టు పరిమళేనా" అన్నారు మేష్టారు నవ్వుతూ. రమణి కూడా నవ్వింది, "అవునండీ అదే" అంటూ.

పరిమళ సిగ్గు పడిపోయింది. ఏమిటో అప్పట్లో అలా బుద్ధి పుట్టింది అనుకుంటూ.

కామమ్మగారు ఇంట్లోకి వెళ్లి, మూడు గ్లాసుల్లో మజ్జిగ తీసుకొచ్చారు. "ఇప్పుడెందుకండీ" అంటూనే పుచ్చుకున్నారు అమ్మాయిలు.

"అమెరికాలో వున్నావన్నమాట అయితే. కిందటినెల మామనవరాలొచ్చి వెళ్లిందిలే, పాంట్లూ, టీషర్టులూను. నువ్వూ అంతేనేమో.? నిలువునా జేబులే?" అన్నారాయన మాటలసందర్భంలో నవ్వుతూ.

"జేబులూ, ఆ జేబులనిండా నోట్లూ? అంతేనా ?" అన్నారు కామమ్మగారు కూడా నవ్వుతూ.

పరిమళ చప్పున మొహం పక్కకి తిప్పుకుని, "అదేం లేదండీ" అంది. ఆవిడ హాస్యానికే అన్నారు. ఆపిల్లమొహం చూసినతరవాత, అయ్యో అలా అనకుండా వుండవలసింది అనిపించింది కామమ్మగారికి మనసులోనే.

పరిమళ మాత్రం మరుక్షణంలో తేరుకుని, తేలిగ్గా నవ్వేస్తూ, "జేబులూ, ఈ జోలె కూడానండీ ఇప్పుడు" అంది చేతిసంచీ చూపిస్తూ. తరవాత సంచీలోంచి "ఇది మీకోసం" అంటూ ఓ బాల్ పాయింటుపెన్ను తీసి మేష్టారికిచ్చింది. ఆయన అందుకున్నారు కృష్ణార్పణం అంటూ.

రమణి "ఎన్ని జేబులున్నా, ఎక్కడున్నా మన పరిమళ మన పరిమళేనండీ మాష్టారూ. జేబులనిండా ఇప్పటికీ కాగితాలూ, పెన్సిళ్లే" అంది.

"కథలు రాస్తున్నావని విన్నాను. చదువులతల్లి కటాక్షం వుంది నీకు. నేను అప్పుడే అనుకున్నాను నువ్వు మంచి రచయిత్రివి అవుతావనీ. అదే సంతోషం నాకు" అన్నారాయన.

"మంచి రచయిత్రి అనేం లేదండీ. ఏదో గిలుకుతూంటాను తోచినప్పుడు" అంది పరిమళ వినయంగా..

"అదేనమ్మా. పెన్సిలు దాచుకోడానికి జేబూ, మనసు దాచుకోడానికి పెన్సిలూను" అన్నారు గుంభనగా.

పరిమళ తెల్లబోయి ఆయనమొహంలోకి చూసింది. ఆయన వదనం గంభీరంగా వుంది. అక్కడేవో అర్థాలు స్ఫురించేయి తనకి. మిగతా ముగ్గురూ అయోమయంగా చూశారు.

ఆపైన ఎవరికీ మాటలు తోచలేదు. నిశ్శబ్దం బరువుగా తెర దించింది వారిమధ్య.

"చీకటి పడుతోంది, వెళ్లొస్తాం మేష్టారూ" అంటూ లేచేరు ముగ్గురూను.

"ఉండండమ్మా, ఒక్కక్షణం" అంటూ కామమ్మగారు లోపలికి వెళ్లి, ఓపళ్లెంలో పళ్లూ తాంబూలంతోనూ తిరిగొచ్చారు. వాళ్లకి బొట్లు పెట్టి, తాంబూలాలు చేతిలో పెట్టారు. పరిమళ వంగి వారిద్దరి పాదాలకి దణ్ణం పెడుతుంటే కనులు చెమ్మగిలేయి. ఈ సాంప్రదాయాలు తను మరిచిపోయి ఎంతకాలం అయిందో ?. కానీ ఈరోజు అప్రయత్నంగానే ఆదంపతులకి నమస్కరించాలనిపించింది.

మరోసారి "వెళ్లొస్తాం మాష్టారూ, వెళ్లొస్తాం అమ్మా," అని ఇద్దరికీ చెప్పి గేటువేపు నడిచారు ముగ్గురూ..

పరిమళ గేటుదగ్గర ఒక్కక్షణం ఆగింది. ఓరవొంపుగా తలొంచి, కొనకళ్ల చూస్తే ఆయన కళ్లొత్తుకోడం కనిపించింది.

చిన్నగా నిట్టూర్చి, రమణిభుజమ్మీద చెయ్యేసి ముందుకి నడిచింది ?.

(పైన 'ఉదహరించిన పాణిని పద్యం నాకు గుర్తున్నట్టుగా రాసేను. పొరపాటులుండొచ్చు. రూపసీ, సద్వర్తనుడూ అయిన పాణిని చిన్నతనంలో విద్యాభ్యాసంలో మాత్రం అట్టే ప్రకాశించలేదట.. కొంతకాలం గురుకులవాసం చేసి, తరవాత, ఏదో కారణంచేత - సహవాసి హేళన చేయడంచేతో, గురువుగారి ప్రోద్బలంతోనో - హిమాలయాలకు వెళ్లి, తపస్సు చేసి ఆతరవాత అఘటిత ప్రజ్ఞాధురీణుడు అయినాడనీ, అష్టాధ్యాయి అన్న వ్యాకరణగ్రంథం రాసి, మొత్తం ప్రపంచంలోనే వైయాకరణులందరికీ మార్గదర్శకుడు అయినాడనీ ప్రతీతి.)

(కథ ఇప్పుడు అంటే 2008లో రాసాను కానీ ఈ జేబు వుదంతం 1950లో జరిగిందని ఆనాటి స్నేహితురాలు శాంత గుర్తు చేసింది నెలరోజులక్రితం.)

❊ ❊ ❊